

**విద్యుత్ ఉత్పత్తికి గండి..**

కేటీపీఎస్‌లో ఓవరాయిలింగ్ పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో విద్యుత్ ఉత్పత్తికి భారీగా గండి పడుతోంది. 11లో





**.. రక్షణ కల్పించండి**

సింగరేణి మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీలో సమస్యలు తిష్ట వేయడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 22°

**వాతావరణం**

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదై.. గంటగంటకూ ఎండ ప్రభావం పెరుగుతుంది.




## న్యూస్‌రీల్

### రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మ వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

### పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

**పాల్వంచరూరల్ :** మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మొదట అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేశారు. ఆ తర్వాత అర్చకులు కుంకుమ పూజ, గణపతి హోమం చేశాక పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యుడు గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

### విషజ్వరాల నివారణకు కృషి

- జిల్లా మలేరియా ప్రోగ్రామ్ అధికారి స్పందన



బాధితురాలితో మాట్లాడుతున్న స్పందన

**చర్ల రూరల్:** చర్ల మండలంలో ఇటీవల విషజ్వరాలు విజృంభిస్తున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ స్పందన తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం ఆమె పర్యటించి జ్వరాల తీవ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో విషజ్వరాల వ్యాప్తి కారణంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మిషన్ భగీరథ పైపుల్లోకి కలుషిత నీరు చేరుతోందని, అదే జ్వరాల వ్యాప్తికి కారణమై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. తాగునీటి నమూనాలను పరీక్షల కోసం పంపామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, వైద్య సిబ్బంది రమాదేవి, హనుమంతు, రాంప్రసాద్, గీత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సైల బదిలీలు

**కొత్తగూడెంటౌన్:** జిల్లాలో ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉన్న ఎం.ప్రసాద్‌ను మణుగూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. కొత్తగూడెంలోని సీసీఎస్‌లో పనిచేస్తున్న సీహెచ్ చంద్రశేఖర్‌ను అన్నపురెడ్డిపల్లి ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పనిచేస్తున్న సయ్యద్ షాహినాను జిల్లాలోని వీఆర్‌కు అటాచ్ చేశారు.

# ‘భద్రాద్రి’ భవితవ్యంపై నీలినీడలు

- బీటీపీఎస్ నిర్మాణ, నిర్వహణ వ్యయం, పనితీరుపై సందేహాలు
- జ్యుడీషియల్ విచారణకు రాష్ట్ర కేబినెట్ తీర్మానం
- కమిటీ నివేదికపై ఆధారపడిన ప్లాంట్ భవిష్యత్

**ప్రభుత్వ రంగంలో** రెండో థర్మల్ పవర్ ప్లాంట్‌గా మణుగూరులో మొదలైన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. దశాబ్దం క్రితం అనేక అనుమానాల మధ్య మొదలైన ఈ విద్యుత్ కేంద్రం మనుగడ ఎన్నాళ్లు అనేది ప్రశ్నార్థకంగా మారింది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్

**అవకతవకలు జరిగాయంటూ..**

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో పియర్లు కుంగడంపై ప్రస్తుత ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణం కూడా నాసిరకంగా జరిగిందని, అనేక అవకతవకలు జరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహిరంగంగానే ప్రకటనలు చేశారు. ఈ నేపథ్యంలో నిర్వహణకు అధిక వ్యయంతో పాటు ఎక్కువ కాలుష్యం వెదజల్లే ఈ రెండు ప్లాంట్లు తెలంగాణకు భారమనే అభిప్రాయం వ్యక్తం చేశారు. చివరకు ఈ ప్లాంట్ల నిర్మాణం, మెయింటెనెన్స్ తదితర అంశాలపై నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి అధ్యక్షతన జ్యుడీషియల్ కమిటీని కూడా నియమించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదికపై భద్రాద్రి పవర్ ప్లాంట్ భవితవ్యం ఆధారపడి ఉంది.

**పెరిగిన నిర్మాణ వ్యయం..**

భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి 2015 మార్చి 15న శంకుస్థాపన చేశారు. ఆరంభంలో నిర్మాణ వ్యయం రూ.7,296 కోట్లుగా అంచనా వేశారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రిక్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్) తక్కువ ధరకే సబ్ క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ నిర్మించేందుకు ముందుకొచ్చిందని అప్పటి ప్రభుత్వం చెప్పింది. ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి 2019లో ప్రారంభం కాగా, అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కావడానికి 2021 వరకు పట్టింది. ఇదే సమయంలో నిర్మాణ వ్యయం రూ.7,296 కోట్ల నుంచి రూ.9,000 కోట్లకు చేరుకుందనే విమర్శలు వచ్చాయి. కానీ ప్రభుత్వం మాత్రం రూ.1,000 కోట్లు అధికంగా ఖర్చయ్యాయని స్పష్టం చేసింది. ఆధునాతన కాలుష్య నియంత్రణ పద్ధతులు పాటించడం వల్ల వ్యయం పెరిగిందని వివరణ ఇచ్చింది.

**.. అయినా తప్పని కాలుష్యం**

ఆధునాతన కాలుష్య నియంత్రణ పద్ధతులు పాటించామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ ప్లాంట్ నుంచి నిత్యం 600 టన్నుల బూడిద ఉత్పత్తి అవుతోంది. ఇందులో 100 టన్నులు వాణిజ్య అవసరాల కోసం విక్రయిస్తుండగా, మిగిలిన బూడిదను నీటితో కలిపి యాష్‌పాండ్లలో వదలాలి. ఇందుకోసం రెండు యాష్‌పాండ్లను నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు చిక్కుడుగుంట దగ్గర ఒక్క యాష్‌పాండ్ మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ఈ ప్లాంట్ నుంచి వచ్చే బూడిద, నీటితో సమీపంలో పొలాలు, గోదావరిలో నీరు కలుషితం అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వాయు కాలుష్యం నియంత్రణ విషయంలోనూ వెనుకబాటే ఉండడం గమనార్హం.

**విద్యుత్ లోటు పేరుతో**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్రంలో విద్యుత్ లోటు ఉంది. దీంతో కొత్త విద్యుత్ కేంద్రాలను శరవేగంతో నిర్మించాలని అప్పటి సర్కార్ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా 4,000 మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి, 1080 మెగావాట్ల సామర్థ్యంతో మణుగూరులో భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టారు. అయితే భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం ఆ రోజుల్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అయినప్పటికీ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెనక్కు తగ్గకుండా నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ విజయవంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. అయితే సబ్ క్రిటికల్ టెక్నాలజీతో చేపట్టిన ఈ ప్లాంట్ నిర్మాణ, నిర్వహణ వ్యయం, పనితీరుపై కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సందేహాలు వ్యక్తం చేస్తోంది.

**సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మాణం..**

థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో సబ్ క్రిటికల్ టెక్నాలజీ అనేది పాత పద్ధతి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్లు నిర్మిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో కూడా పవర్ ప్లాంట్ల నిర్మాణం జరుగుతోంది. సూపర్, అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో పోల్చితే సబ్ క్రిటికల్ టెక్నాలజీలో విద్యుత్ ఉత్పత్తి కోసం ఎక్కువ నీరు, బొగ్గు ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే ప్లాంట్ నుంచి వెలువడే వాతావారణ కాలుష్యం కూడా ఎక్కువే. దీనికి తోడు సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన ప్లాంట్‌లో ఉత్పాదక సామర్థ్యం 33 నుంచి 37 శాతం వరకు ఉంటుండగా, సూపర్ క్రిటికల్‌లో 40 నుంచి 45 శాతం వరకు ఉంటోంది. అందుకే సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నడిచే ప్లాంట్లను మూసేయాలంటూ పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చెబుతూ వస్తోంది. అయినప్పటికీ బీటీపీఎస్‌ను మాత్రం సబ్ క్రిటికల్ టెక్నాలజీతోనే నిర్మించారు.

# ‘ధరణి’ సమస్యలు పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన అధికారులు

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** ధరణి పెండింగ్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ, అటవీ, సర్వే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరణి దరఖాస్తులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని సూచించారు. ఫిర్యాదులన్నీ ఏడు రోజుల్లో పరిష్కరించాలని, తిరస్కరణకు గురైతే కారణాలను చెక్ లిస్ట్‌లో నమోదు చేయాలని అన్నారు. పార్టీషన్ ఫైళ్ల తనిఖీ చేస్తామని, పొరపాట్లు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రెవెన్యూ కార్యాలయంలో ధరణి దరఖాస్తులకు రిజిస్టర్ ఏర్పాటు చేయాలని, ప్రతి దరఖాస్తు ఇన్, అవుట్ వార్డు రిజిస్టర్లలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మీ సేవ పెండింగ్ దరఖాస్తులను కూడా సత్వరమే పరిష్కరించాలన్నారు. తహశీల్దార్లు, ఆర్డీఓలు తమ పరిధిలోని దరఖాస్తులను పది రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. స్థానికంగా పరిష్కరించకపోవడం వల్లే సుదూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తున్నారని అన్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు అవసరమైన పెండింగ్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా స్థాయి కమిటీల ద్వారా ఇప్పటి వరకు తొమ్మిది ఇసుక రీచ్‌లకు అనుమతి ఇచ్చామని, రెండు రోజుల్లో మరో రెండు రీచ్‌లకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఇసుక అవసరమైన వారు ‘మన ఇసుక వాహనం’– https//tsmiv.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. ఇసుక రీచ్‌లలో సాయంత్రం 6 గంటల వరకే లోడింగ్ అనుమతి ఉంటుందని ప్రకటించారు. ఇసుకకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాల నివృత్తికి 08744 – 241950 హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్ మాట్లాడుతూ పోడు పట్టాలు ఉన్నవారు తప్ప కొత్తగా ఎవరూ పోడు వ్యసాయం చేయొద్దని చెప్పారు, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ మేరకు గిరిజనులకు అవగాహన కల్పించాలని రెవెన్యూ అధికారులను కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఆర్డీఓలు మధు, దామోదర్, ఎస్‌డీసీ కాశయ్య, ఏఓ గన్యా తదితరులు పాల్గొన్నారు.

**మౌలిక వసతుల బాధ్యత ‘అమ్మ’ కమిటీలదే**

జిల్లాలో యూడైస్ డేటా ప్రకారం గుర్తించిన 697 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 22.69 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో మైనర్, మేజర్ మరమ్మతులు, విద్యుదీకరణ, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారానే పనులు చేయిస్తామని చెప్పారు. ఇందుకోసం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్లుగా, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, పాఠశాలలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు పిల్లల తల్లులను సభ్యులుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కన్వీనర్, చైర్‌పర్సన్ పేరుతో జాయింట్ ఖాతా తెరవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కేటాయించిన నిధులను ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. శనివారం సాయంత్రం వరకు కమిటీలు, పనుల అంచనాలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తీర్మానాలు చేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకం కింద బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను అప్‌లోడ్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

**రెవెన్యూ డైరీ ఆవిష్కరణ..**

జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని కలెక్టర్ ప్రియాంక శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఆర్డీఓలు మధు, దామోదర్, ఏఓ గన్యా పాల్గొన్నారు.

## వ్యవసాయ క్షేత్రంలో తుమ్మల



పుచ్చ పంటను పరిశీలిస్తున్న మంత్రి

**దమ్మపేట:** రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అప్పారావుపేటలోని తన వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పుచ్చ పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణతో చర్చించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ మాజీ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, ఆదర్శ రైతు పొన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ‘పది’ పరీక్షలకు రెడీ



జూలూరుపాడులోని ఓ పాఠశాలలో పరీక్షల కోసం సిద్ధం చేసిన బెంచీలు

- జిల్లాలో 73 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 12,341 మంది విద్యార్థులు
- సెల్‌ఫోన్ రహిత కేంద్రాలుగా నిర్వహణ
- ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు

**కొత్తగూడెంఅర్బన్:** పదో తరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా, పరీక్షలు సజావుగా నిర్వహించేలా జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో సర్వం సిద్ధం చేస్తున్నారు. గతేడాది ఇతర జిల్లాల్లో పేపర్ లీకై వాట్సాప్ గ్రూప్‌ల్లో చక్కర్లు కొట్టింది. అయితే జిల్లాల్లో అలాంటి పరిస్థితి తలెత్తకుండా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాలను సెల్‌ఫోన్ రహిత సెంటర్లుగా మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇన్విజిలేటర్లు, సిబ్బంది సెల్‌ఫోన్లు కేంద్రాల్లోకి తీసుకెళ్లవద్దంటూ ముందుగానే సమాచారం అందించారు. జిల్లాలో గతేడాది 12,481 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 9,801 మంది(78 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఈ సంవత్సరం అంతకంటే మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేశామని, ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించామని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, సీసీ కెమెరాలు, గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు.

**కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి..**

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, రూట్ అధికారులను నియమించారు. ఇంకా 720 మంది ఇన్విజిలేటర్లు, ఐదు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్‌లు విధులు నిర్వర్తించనున్నారు. ఈనెల 18 నుంచి 30 వరకు.. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు అర్ధగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో మొత్తం 12,341 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, 5,900 మంది బాలురు, 6,441 మంది బాలికలు ఉన్నారని, వీరికోసం 73 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశ్నపత్రాలను 23 పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు.

**కేంద్రాల వద్ద 144 సెక్షన్**

జిల్లాలో ఏర్పాటుచేసిన 73 కేంద్రాల పరిసరాల్లో పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు. కేద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. పటిష్ట పోలీస్ బందోబస్తు నడుమ విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతిస్తారు. బాలికలను తనిఖీ చేసేందుకు మహిళ కానిస్టేబుళ్లతో పాటు ఉపాధ్యాయురాళ్లను ఏర్పాటు చేయనున్నారు. సెల్‌ఫోన్లతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

**అన్ని ఏర్పాట్లు చేశాం**



ఈనెల 18 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలోని 73 కేంద్రాల్లో 12,341 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అన్ని కేంద్రాలను సెల్‌ఫోన్ రహితంగా మార్చి పరీక్షలు నిర్వహిస్తాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి. గతేడాది కంటే మెరుగైన ఉత్తీర్ణత సాధిస్తాం.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ

# అద్దె భవనాలు.. పాత వాహనాలు

**ఇదీ ఉమ్మడి జిల్లాలో అగ్నిమాపక శాఖ పరిస్థితి**

- డీఎఫ్‌ఓ కార్యాలయమూ అద్దె భవనంలోనే..
- సరిపడా ఉద్యోగులు లేక ఉన్న వారిపైనే భారం
- ప్రమాదాలు జరిగిన సమయాన ఇక్కట్లు





శిథిలావస్థలో మధిర ఫైర్ స్టేషన్ భవనం (ఇన్‌సెట్) పెచ్చులు ఊడి పడుతున్న స్లాబ్

**మధిర:** అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు నష్టతీవ్రతను తగ్గించేలా అందుబాటులో ఉండాల్సిన ఫైర్ ఇంజన్లు, అగ్నిమాపక కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. రోజురోజుకు ఎండలు పెరుగుతుండగా అగ్నిప్రమాదాలే అదే స్థాయిలో జరిగే అవకాశముంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 70కి పైగా కోల్డ్ స్టోరేజీలు, 25 జిన్నింగ్ మిల్లులు, వెయ్యికి పైగా విద్యాసంస్థలు, 120 టింబర్ డిపోలే కాక గ్రానైట్ పరిశ్రమలు వందల సంఖ్యలో ఉన్నందున ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే నిమిషాల వ్యవధిలో చేరుకొని మంటలను అదుపు చేస్తూ ఆస్తినష్టం పెరగకుండా చూడాల్సిన బాధ్యత అగ్నిమాపక శాఖపై ఉంది. కానీ అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలు, కాలం చెల్లిన వాహనాలు, సరిపడా సిబ్బంది లేని కారణంగా ఇక్కట్లు ఎదురవుతున్నాయి. దీంతో ఎండలు ముదురుతున్న నేపథ్యాన ఒకేసారి రెండు, మూడు చోట్ల ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన ప్రజలను వేధిస్తోంది.

**12కేంద్రాలు...**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. కూసుమంచి, ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, పినపాక, మణుగూరు, నేలకొండపల్లిలో ఇవి కొనసాగుతున్నాయి. అయితే, మణుగూరు, నేలకొండపల్లి ఫైర్ స్టేషన్లు ఔట్ పోస్టులుగా ఉన్నాయి. ఇవి కూడా ఇటీవల ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చినా.. కేవలం హోంగార్డులే విధులు నిర్వర్తిస్తున్నారు.

**పరిధి.. చాంతాడంత**

జిల్లా అగ్నిమాపక శాఖలో 25 పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇటీవల 22 మంది చేరారు. కానీ వారు ఇంకా శిక్షణలోనే కొనసాగుతుండడంతో కొరత వేధిస్తోంది. ఒక అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు, పది మంది ఫైర్‌మెన్లు ఉండాలి. కానీ ఏ కేంద్రంలో కూడా సరిపడా ఉద్యోగులు లేరు. ఫలితంగా టీఎస్‌ఆర్టీసీ నుంచి ఏడుగురు రిటైర్డ్ డ్రైవర్లను కాంట్రాక్టు పద్ధతిపై నియమించారు. ఇక వైరా, ఇల్లెందు, అశ్వారావుపేట, మధిర, పినపాక కేంద్రాల్లో ఇన్‌చార్జ్ అధికారుల ఆధ్వర్యంలోనే ఫైర్ స్టేషన్లు కొనసాగుతున్నాయి. మధిర అగ్నిమాపక కేంద్రం పరిధిలో మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలతో పాటు కల్లూరు మండలంలోని కొన్ని గ్రామాలు కూడా ఉండడంతో ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బంది వెళ్లడం ఆలస్యమవుతోంది. గత ఏడాది ఏప్రిల్ 1నుంచి నుంచి ఈ ఏడాది మార్చి 14వ తేదీ వరకు జిల్లాలో 74 అగ్నిప్రమాదాలు జరగ్గా.. అరకొరగా ఉన్న సిబ్బందే శ్రమించి ఆస్తినష్టం పెరగకుండా అడ్డుకట్ట వేయగలిగారు.

**అదనపు కేంద్రాలు నెలకొల్పితేనే..**

ఖమ్మంలో ఒకే అగ్నిమాపక కేంద్రం ఉంది. ఇక్కడ వందల సంఖ్యలో ఆస్పత్రులు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రానైట్ పరిశ్రమలు ఉన్నందున రెండో యూనిట్ మంజూరు చేయాలనే ప్రతిపాదనలు ఏళ్లుగా ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. అలాగే, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కల్లూరులోనూ ఫైర్ స్టేషన్ లేదు. దీంతో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే సుదూర ప్రాంతం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఆస్తి నష్టం పెరుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల్లో వసతులు కల్పించడమే కాక నూతన వాహనాలను కేటాయించి ఉద్యోగులను భర్తీ చేస్తే తప్ప ఫలితం ఉండదని చెబుతున్నారు.



అద్దె భవనంలో ఉన్న ఖమ్మంలోని డివిజనల్ ఫైర్ అధికారి కార్యాలయం

**ప్రమాదకరంగా భవనాలు**

- మధిర అగ్నిమాపక కేంద్ర భవనం 1987లో నిర్మించారు. చిన్నపాటి వర్షానికే స్లాబ్ నుంచి నీరు కారుతుంది. ఇక స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిన్నారు.
- వైరాలో కేంద్రానికి భవనం లేకపోవడంతో మార్కెట్ యార్డ్‌లో ఫైర్ ఇంజన్‌ను ఉంచుతున్నారు.
- కూసుమంచిలో ఫైర్ ఇంజన్‌ను పాఠశాలలో పెట్టి సిబ్బంది విధులకు హాజరవుతున్నారు.
- పినపాకలో ఇటీవలే నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడ 17ఏళ్లుగా వినియోగిస్తున్న వాహనమే కొనసాగుతోంది. సాధారణంగా ఏ వాహనమైనా 15ఏళ్లు వినియోగించాక తప్పించాలి. కానీ ఆ సమయం దాటినా కొనసాగిస్తుండడంతో ప్రమాదస్థలికి సిబ్బంది సరైన సమయంలో చేరుకోలేకపోతున్నారు.
- ఖమ్మంలోని ఫైర్ స్టేషన్ ఎన్నెస్పీ క్యాంప్‌లోని ఒక రేకుల షెడ్డులో కొనసాగుతుంది.
- ఉమ్మడి జిల్లాలో కార్యకలాపాలను పర్యవేక్షించాల్సిన డివిజనల్ ఫైర్ ఆఫీసర్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండడం గమనార్హం.

## క్లుప్తంగా

### శివాలయం హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు

**అన్నపురెడ్డిపల్లి :** మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయ హుండీలను ఆదాయాన్ని దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ ఇన్స్పెక్టర్ భేల్‌సింగ్ పర్యవేక్షణలో అధికారులు శుక్రవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ 3,49,884, షాపుల ద్వారా రూ.1,38,200, ఆర్జితసేవల ద్వారా రూ 39.556, కేశఖండన టికెట్ల రూపంలో రూ.1,020, దర్శన టికెట్ల ద్వారా రూ 1,56,420, కల్యాణ కట్నాలు రూ. 9,940 లభించాయని ఆలయ మేనేజర్ వెంకటరమణ వివరించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా మొత్తం రూ. 8,19,241 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

### తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీలు


చికెన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

**ఇల్లెందు:** చికెన్ దుకాణాల్లో ఎల్రక్టానిక్ కాటాలను ఏర్పాటు చేసి అరకిలోకు 50 గ్రాములు, కిలోకు 100 గ్రాములు తక్కువగా తూకం వేస్తున్నారని అందిన సమాచారంతో తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయం నుంచి గోవింద్‌సెంటర్ వరకు ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేయగా తేదీ మీరిపోయిన శీతలపానీయాల విక్రయాలు జరుగుతున్నట్లు గ్రహించి పట్టుకున్నారు. ఆ శీతలపానీయాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పలు చికెన్ దుకాణాల్లోనూ తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు.

### ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోండి

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని నిరుద్యోగ గిరిజన యువత సింగరేణి సంస్థలో ఉద్యోగాలకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పీఓ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో సూచించారు. సింగరేణిలో వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందని తెలిపారు. గిరిజన యువతకు పరీక్ష ఫీజు మినహాయింపు ఉండగా, దరఖాస్తు ఫీజు రూ.100 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు అర్హతలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని పీఓ సూచించారు.

### యూనిఫాం పంపిణీ


యూనిఫాంతో నాలుగో తరగతి ఉద్యోగులు

**చుంచుపల్లి:** జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోని పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న యూనిఫాంను శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, సీఈఓ ప్రసూనారాణి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నాలుగో తరగతి ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పులికంటి వెంకటేశ్వర్లు, జెడ్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పాత కక్షల నేపథ్యంలో దాడి

**గుండాల:** పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటన ఆళ్లపల్లి మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రాయపాడు గ్రామానికి చెందిన రవీందర్ భార్య గతంలో మృతి చెందగా అందుకు కారణం అదే గ్రామానికి చెందిన రమేశ్ అనే వ్యక్తి అని రవీందర్ కక్ష పెంచుకున్నాడు. గతంలో వారిద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో రమేశ్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రవీందర్ గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రమేశ్‌ను కొత్తగూడెం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీశ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేస్తామని తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు స్వాధీనం

**పాల్వంచరూరల్:** అనుమతి లేకుండా ఇసుక తలిస్తున్న మూడు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని తోగ్గూడెం శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను శుక్రవారం తెల్లవారుజామున పట్టుకుని డ్రైవర్లు, వాహనాల యజమానులు మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,045 |

# బాబోయ్.. రక్షణ కల్పించండి..

- కేసీహెచ్‌పీలో దుమ్ముతో కార్మికుల తీవ్ర ఇబ్బందులు
- జీఎంకు సమస్యలు ఏకరువు పెట్టిన కార్మికులు

**మణుగూరుటౌన్:** సింగరేణికి మణిహారంగా ఉన్న మణుగూరు ఏరియాలో బొగ్గు తరలింపునకు ప్రధాన భూమిక పోషిస్తున్న కేసీహెచ్‌పీ (కోల్ కటింగ్ హ్యాండ్లింగ్ ప్లాంట్)లో సమస్యలు తిష్ట వేయడంతో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయడంతో కార్మికుల రక్షణ, ఆరోగ్యం గాలిలో దీపాలుగా మారుతున్నాయి. రక్షణ, పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పనకు విశేష కృషి చేసే సింగరేణి యాజమాన్యం.. నెలల తరబడి విన్నవిస్తున్నా.. హామీలు ఇవ్వడం తప్ప పరిష్కారం చూపడం లేదని కేసీహెచ్‌పీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విపరీతంగా లేస్తున్న దుమ్ము (డస్ట్) వల్ల తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. పని ప్రదేశాల్లో రక్షణ చర్యలు లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం రెండో షిఫ్ట్‌లో సుబ్రహ్మణ్యనాయుడుకు జరిగిన ప్రమాద ఘటన రక్షణ చర్యల డొల్లతనాన్ని ఎత్తిచూపుతున్నాయి. ప్రాథమిక పరిశీలనకు వచ్చిన జీఎంకు కార్మికులు సమస్యలు ఏకరువు పెట్టారు. పని ప్రదేశాల్లో వసతులు ఇలా ఉంటే పని ఎలా చేయాలంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ కేసీహెచ్‌పీలోని పరిస్థితిని వివరించారు. స్పందించిన జీఎం దుర్గం రాంచందర్ సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని, మిగతా సమస్యలు కూడా పరిష్కరిస్తామని, దుమ్ము నియంత్రణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.


ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు సమస్యలు వివరిస్తున్న కేసీహెచ్‌పీ కార్మికులు

**సమస్యలతో సహవాసం..**

వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ఇటీవలే నిర్మించిన కొత్త బంకర్‌లోని బెల్ట్‌కు సేఫ్టీ లేని కారణంగా నడపొద్దని చెప్పినా యాజమాన్యం పట్టించుకోలేదని తెలుస్తోంది. కొత్త బంకర్ నిర్మాణంలో లోపాలున్నాయని కార్మికులు పదేపదే చెబుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొగ్గు తరలింపులో కీలకంగా పని చేయాల్సిన ప్రదేశమైన కన్వేయర్ బెల్ట్ వద్ద అక్కడక్కడా పరిస్థితిని పర్యవేక్షించే సౌకర్యం (ప్లాట్‌ఫాం) లేకపోవడం వల్ల కార్మికులు పెద్ద బౌల్డర్లు (పెద్ద బొగ్గు పెల్లలు) వచ్చినప్పుడు, బెల్ట్ మార్పు సమయంలో రిటర్న్ రోల్‌లో సమస్యలు తలెత్తినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**దక్కని పరిష్కారం..**

బెల్ట్ నడిచే సమయంలో వచ్చే డస్ట్ వల్ల నడుస్తున్న బెల్ట్ పూర్తిస్థాయిలో కనిపించకపోవడంతో పాటు కార్మికులు కేసీహెచ్‌పీ పరిసరాల్లో విధులు నిర్వర్తించాలంటే భయపడాల్సిన దుస్థితి నెలకొన్నది. దుమ్ము, ధూళి మింగుతూ శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. 2007–08లో డస్ట్ (స్ప్రే) కావేరి పేరిట ప్రవేశపెట్టినా అది ఆరంభ శూరత్వంగా ముగియగా, దాదాపు ఎనిమిది నెలల కిందట రూ.3 కోట్లతో డస్ట్ సప్రెషర్ ఏర్పాటు చేస్తామని చెప్పిన యాజమాన్యం ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విషయమై ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

బెల్ట్‌ల వద్ద అక్కడక్కడా ప్లాట్‌ఫాం లేకపోవడంతో రిటర్న్ రోల్‌లో సమస్యలేర్పడితే సేఫ్టీ బెల్టులతో వేలాడుతూ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడక్కడా తుప్పుపట్టిన గ్యాంట్రీలపై నడవాలంటే కష్టతరంగా మారింది. బెల్ట్ ఆన్ చేసే సమయంలో 40 సెకండ్ల అలర్ట్ అలారం వచ్చే పరిస్థితి ఉండగా, ఆ శబ్దం ఎవరికీ వినపడని పరిస్థితి ఉంది. పని స్థలాల్లో లైటింగ్ లోపం వంటి సమస్యలపై సేఫ్టీ సమావేశాల్లో ప్రస్తావించినా, మినిట్స్ పుస్తకాల్లో రాసినా చర్యలు శూన్యంగా మారాయి.

# నకిలీ ఖాతాలతో రూ.లక్షల్లో రుణాలు!

విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం

**పాల్వంచ:** పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో నకిలీ ఖాతాలు తెరిచి వారి పేర్ల మీద రూ.లక్షలు రుణాలు తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఆ బ్యాంక్‌లో ఇలా పదుల సంఖ్యలో నకిలీ ఖాతాలున్నట్లు అక్కడి సిబ్బంది వాపోతుండటంతో ఖాతాదారుల గుండెల్లో గుబులు రేపుతోంది. బాధితుల కథనం మేరకు.. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన జంగిలి వసంతరావు భార్య అమృతకుమారి ఖమ్మంలో రూ.55 లక్షలతో భూమి కొనుగోలు చేసి బయానా కట్టారు. అనంతరం అక్కడి ఎస్‌బీఐలో హోంలోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో వారు వేరే బ్యాంక్‌లో రుణం తీసుకున్నారని, అవి క్లియర్ చేయలేదని చూపిస్తోందని అక్కడి సిబ్బంది చెప్పడంతో వారికి ఎక్కడా రుణాలు లేవని చెప్పారు. అయితే, వారి పేరుతో పాల్వంచలోని నటరాజ్ సెంటర్ వద్ద గల ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఖాతా ఓపెన్ చేసి ఉండటంతో బాధితులు ఇక్కడికి వచ్చి బ్యాంక్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ఇంటి పేరు ఒక లెటర్ తప్పుతో పాటు ఫొటో మాత్రం ఆమెదే ఉంచి రూ.లక్షల్లో గోల్డ్‌లోన్ తీసుకున్నట్లు చూపించారు. ఇలా రెండేళ్లు ఖాతా ద్వారా లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంతేగాక మరో 17 ఫేక్ ఖాతాల పేరుతో రుణాలు తీసుకున్నట్లు అక్కడి బ్యాంక్ సిబ్బంది తమకు తెలిపారని బాధితులు చెప్పారు. ఈ విషయాలపై పూర్తి విచారణ చేస్తే మరిన్ని వివరాలు వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై పట్టణ ఎస్‌ఐ బి.రామును వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని, దర్యాప్తు చేస్తున్నామన్నారు. రుణం తీసుకున్న అతను, బాధితురాలు వరుసకు అత్త, అల్లుడే అని, సిబిల్ స్కోర్ తగ్గడంతో లోన్ తీసుకున్నారని, దీనిపై పూర్తి వివరాలు త్వరలోనే తెలుపుతామన్నారు. బ్యాంక్ మేనేజర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


లావాదేవీలకు సంబంధించిన పత్రం

# వినూత్నంగా హాల్‌టికెట్ల పంపిణీ

**టేకులపల్లి:** ఈ నెల 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. అయితే, విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం పొందటం విశేషం. ఉపాధ్యాయులు కూడా పరీక్షకు అవసరమైన వస్తువులను బహుమతిగా ఇచ్చి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో టేకులపల్లి హైస్కూల్ హెచ్‌ఎం మెరుగు శ్రీనివాస్, సులానగర్ హైస్కూల్ హెచ్‌ఎం జి.దేవదాస్, ఉపాధ్యాయులు రంగారావు, చంద్రసింగ్, లాలు, ధనలక్ష్మి, స్వరూప, రాణి, శేఖర్, బాబూరావు, శైలజ, మోహన్‌రావు, సురేశ్, సీతమ్మ, శ్రీదేవి, సత్యనారాయణ, రవీందర్, దస్రు పాల్గొన్నారు.


తల్లి పాదాలకు నమస్కరిస్తున్న విద్యార్థిని

# కిరాణా దుకాణాల్లో చోరీ

ఆధారాలు సేకరించిన క్లూస్ టీం

**అశ్వారావుపేటరూరల్:** ఒకే రోజు గుర్తుతెలియని దుండగులు పలు కిరాణా దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత వరుస చోరీలకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణాల్లోనే ఈ చోరీలు జరగడం చర్చనీయాంశంగా మారింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న వేముల శ్రీనుకు చెందిన సూపర్ మార్కెట్‌లో రూ.20 వేల నగదు, ఒక సెల్‌ఫోన్, వేముల పవన్‌కు చెందిన ఫ్యాన్సీ షాపులో రూ.6 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ చోరీకి గురయ్యాయి. ఈ దుకాణాలకు ఎదురుగానే ఉన్న శీమకుర్తి గంగరాజుకు చెందిన కిరాణా షాపులో సుమారు రూ.10 వేల చిల్లర కాయిన్లు అపహరించారు. పక్కనే ఉన్న కూరగాయల దుకాణంలోకి చొరబడి నగదు దొరక్కపోవడంతో షాపులో ఉన్న కూరగాయలు చోరీ చేశారు. గుర్తు తెలియని దుండగులు ఆయా దుకాణాల షెట్టర్ల తాళాలను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించగా, సూపర్ మార్కెట్‌లో ఉన్న సీసీ కెమెరాలో చోరీకి పాల్పడిన ఘటన రికార్డయింది. సీసీ కెమెరాలో రికార్డు ప్రకారం చోరీ ఘటనలు అర్ధరాత్రి 1.30 గంటలకు జరగ్గా, ఓ యువకుడు చేతులకు ముఖానికి మాస్క్ ధరించి ఉన్నాడు. బాధితుల ఫిర్యాదుతో స్థానిక ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను ఘటనా స్థలాలను పరిశీలించారు. అనంతరం కొత్తగూడెం నుంచి క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం


ఆధారాలు సేకరిస్తున్న కొత్తగూడెం క్లూస్ టీం

### జీవాలకు గాలికుంటు నివారణ టీకా


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

**టేకులపల్లి:** పశువుల్లో గాలికుంటు వ్యాధులు సోకకుండా ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహించే జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని కోయగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్య, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి బి.పురుంధర్ మాట్లాడుతూ.. పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి వి.సంతోష్, రాజేశ్‌ఖన్నా, పార్వతి, సాధిక, వెంకటేశ్వర్లు, జయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


చరణ్ (ఫైల్)

**భద్రాచలంఅర్బన్:** పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం రాత్రి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఏఎంసీకాలనీకి చెందిన శ్రీరాముల చరణ్ ఈ నెల 10న పురుగులుమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి భాస్కరాచారి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు.

**పాల్వంచ మండలంలో..**

**పాల్వంచరూరల్:** పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఉల్వనూరు జీపీ పెద్దకలస గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మడకం దేవా (40) రెండేళ్ల కింద పడటంతో వెన్నుకు దెబ్బతగిలింది. అప్పటి నుంచి నొప్పితో బాధపడుతుండగా గురువారం తీవ్రమైంది. దీంతో పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య భీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

# గ్లకోమాతో పొంచి ఉన్న ప్రమాదం..

- చూపు మందగించే అవకాశం
- లక్షణాలు కనిపిస్తే పరీక్ష చేయించుకోవడం మంచిది
- క్రమం తప్పక మందులు వాడితే ఫలితం

**ఖమ్మంవైద్యవిభాగం:** ప్రస్తుతం గ్లకోమా(నీటికాసులు) అనేక మంది జీవితాల్లో అంధకారాన్ని నింపుతోంది. ఈ వ్యాధిపై అవగాహన లేకపోవడం, సరైన సమయంలో గుర్తించకపోవడంతో గ్లకోమా బాధితులు చూపు కోల్పోతున్నారు. 40ఏళ్ల వయస్సు పైబడిన వారిలో ఈ వ్యాధి తీవ్రత అధికంగా కనిపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అంధత్వానికి కారణాల్లో శుక్లాల తర్వాత రెండోది గ్లకోమా అని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. కంటిలో ఎక్వియస్ హ్యూమర్ అనే నీటిలాంటి ద్రవపదార్థం నిరంతం ఊరుతూ బయటకు పోతుంది. అయితే, ఈ ద్రవ పదార్థం ఊరడం, బయటకు వెళ్లడంలో వ్యత్యాసం ఉంటే చూపు మందగిస్తుంది. ఈ వ్యాధినే గ్లకోమా అని అంటారు.

**కంటి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం..**

గ్లకోమా రావడానికి గల కారణాలను ఇప్పటికీ గుర్తించలేకపోయారు. అయితే, వ్యాధి వచ్చిందని గుర్తించగల సంకేతాలు లేకున్నా దీని బారిన పడే అవకాశాలు ఎవరికి ఎక్కువగా ఉంటాయో శాస్త్రీయంగా గుర్తించారు. కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉన్నా మిగిలిన వారికి వ్యాధి వచ్చే అవకాశముంది. మధుమేహం, బీపీ, థైరాయిడ్ లోపాలు గల వారే కాక హ్రస్వదృష్టి ఉన్నవారు, ఎక్కువగా స్టెరాయిడ్స్ వాడే వారు ఈ వ్యాధి బారిన పడే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. కంటి నరం పరీక్ష చేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడింది, లేనిది తెలుసుకోవచ్చు.

**అందరికీ అవగాహన అవసరం..**



గ్లకోమాపై అందరికీ అవగాహన అవసరం. అందుకోసం ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను ఏటా మార్చి 10నుండి 16వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఖమ్మంలోని అఖిల ఆస్పత్రి ద్వారా ఈ పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం. ఈనెల 31 వరకు గ్లకోమా అనుమానితులకు ఉచితంగా ప్రాథమిక పరీక్షలు, నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తాం. చిన్నారులకైతే చికిత్స కూడా ఉచితంగా చేస్తాం.

– డాక్టర్ మాధవి, కంటి వైద్య నిపుణులు, ఖమ్మం

### బార్ ఎలక్షన్ ఆఫీసర్‌గా గణేశ్


పలివేల గణేశ్‌బాబు

**కొత్తగూడెంటౌన్:** కొత్తగూడెం బార్ కౌన్సిల్ ఎలక్షన్స్ ఆఫీసర్‌గా పలివేల గణేశ్‌బాబును నియమిస్తున్నట్లు శుక్రవారం బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని బార్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసింది. కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా పలివేల గణేశ్‌బాబు, అధ్యక్ష, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శి, సాంస్కృతిక కార్యదర్శి, మహిళా రిప్రజెంటేటివ్ పదవులకు నామినేషన్లు ఈ నెల 18 నుంచి 21 వరకు స్వీకరిస్తారని, మార్చి 22వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 28 ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

### రెవెన్యూ సిబ్బంది కళ్లు గప్పి..

**తప్పించుకున్న మట్టితరలిస్తున్న దుండగులు**

**దుమ్ముగూడెం:** మండలంలోని రామచంద్రపురం గ్రామంలో అక్రమంగా మట్టి తోలకాలు చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని తీసుకొస్తుండగా మార్గమధ్యలో డ్రైవర్లు వాటిని తప్పించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రామచంద్రాపురం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తోలకాలు చేస్తున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తీసుకొస్తుండగా భైరాగులగూడెం గ్రామానికి వచ్చే సరికి రెవెన్యూ సిబ్బంది కళ్లగప్పి నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీ వాహన డ్రైవర్లు వాహనాలతో సహా పరారయ్యారు. సిబ్బంది వెంబడించినప్పటికీ వాహనాల ఆచూకీ లభించలేదు.

### రేషన్ బియ్యం పట్టివేత

**పినపాక:** తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని ఈ బయ్యారం పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అశ్వాపురం మండలానికి చెందిన ఈ ముగ్గురు జానంపేట నుంచి అశ్వాపురం వైపు బియ్యం తరలిస్తుండగా గడ్డంపల్లి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటప్పయ్య తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

**కరకగూడెం:** మండలంలోని అనంతారం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ చేసిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డం సత్యనారాయణ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు సదరు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును చోరీ చేశారు. దాని విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని కరకగూడెం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్‌రెడ్డి తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

- ఇద్దరు మావోయిస్టుల మృతి

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం రాత్రి పోలీసులు – మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోలు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాలోని ఇంద్రావతి నది సమీపాన నేషనల్ పార్క్ వద్ద మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగాపోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా, నిత్యావసర వస్తువులు, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఇద్దరి మృతదేహాలను బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు.

### సెర్ప్ కార్యాలయంలో చోరీ

**ఇల్లెందురూరల్:** మండలంలోని సెర్ప్ కార్యాలయంలో వ్యవసాయానికి వినియోగించే రొటోవేటర్ చోరీకి గురైంది. రైతులకు అద్దె ప్రాతిపదికపై ఇచ్చేందుకు ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో నగదు చెల్లించేలా వ్యవసాయ యంత్రాలను సమకూర్చింది. ప్రస్తుతం యంత్రాలు సెర్ప్ కార్యాలయంలో ఉన్నాయి. కొంతకాలంగా వాటిని రైతులకు సెర్ప్ అధికారులు అద్దెకు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మహిళా శక్తి కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సెర్ప్ కార్యాలయంలో భద్రపర్చిన రొటోవేటర్‌ను చోరీ చేశారు. హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన తరువాత గుర్తించిన సెర్ప్ ఏపీఎం దుర్గారావు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కరుణాకర్ సెర్ప్ కార్యాలయం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. దీనిపై విచారణ చేపట్టారు.

**ఆలయంలో చోరీ**

**జూలూరుపాడు:** మండలంలోని పాపకొల్లు శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ప్రవేశించి, హుండీ తాళాలు పగలగొట్టిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ జీవన్‌రాజు కథనం ప్రకారం.. ఆలయంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగలగొడుతుండగా చుట్టపక్కల వారు అక్కడకు వచ్చారు. దీంతో వారు పరారయ్యారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి నల్లమోతు శేషయ్యకు గ్రామస్తులు విషయం తెలపగా శుక్రవారం ఆయన ఆలయాన్ని పరిశీలించారు. ఆలయం గేటు, హుండీ తాళం పగలగొట్టి ఉన్నాయని, ఎలాంటి చోరీ జరగలేదని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### లారీ క్లీనర్ మృతిపై కేసు నమోదు

**ముదిగొండ:** ముదిగొండ సమీపాన తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ క్లీనర్ మహ్మద్ సలీం(60) గురువారం మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన వడదెబ్బ కారణంగానే మృతి చెందినట్లు సలీం కుమారుడు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

# యూనివర్సిటీ హామీని నెరవేర్చండి

**ఖమ్మంమయూరిసెంటర్:** ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు హామీ ఏళ్లుగా నెరవేరడం లేదని.. ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులైనా దృష్టి సారించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఫీజు బకాయిలు, ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు, నాయకులు కలెక్టరేట్‌కు చేరుకోగా పోలీసులు అడ్డుకోవడం తోపులాట జరిగింది. ఈసందర్భంగా పోలీసులు వారికి సర్దిచెప్పి పంపించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉండగా.. ఖమ్మంలో ఏర్పాటుచేయడం లేదన్నారు. 2008లో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఇచ్చిన హామీని ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు నాగుల్‌మీరా, చందులాల్, సురేష్, ప్రతాప్, రాకేష్, రాజు, అయ్యప్ప, నరేష్, గోపి, సాయి, ఉమామహేష్, పావని, రజిత, లలిత, కుమారి పాల్గొన్నారు.



### విద్యుత్ ఉద్యోగుల డీఏ విడుదలకు ఆదేశాలు

**పాల్వంచ :** విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన డీఏ విడుదల చేయాలని టీఎస్ ట్రాన్స్‌కో, ఎస్‌ఎన్‌సీపీడీ ఆదేశాలు జారీ చేశాయని 1535 యూనియన్ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే జెన్‌కోలో కూడా ఆదేశాలు వస్తాయని, ఇందుకు తమ యూనియన్ ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. డీఏ విడుదలకు అంగీకరించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

### వ్యక్తిపై దాడి


తలపై గాయంతో ఏకాంబరేశ్వరరావు

**దమ్మపేట:** భూవివాదం కారణంగా వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని మందలపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు ఏకాంబరేశ్వరరావు శుక్రవారం అఖినేపల్లి రెవెన్యూ పరిధిలోని తన వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వేమవరపు భద్రయ్య, కాంతారావు, నర్సింహారావు ఆ వ్యవసాయ క్షేత్రంలోకి ప్రవేశించి ఏకాంబరేశ్వరరావుపై ఆయుధంతో దాడి చేయగా, అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

### భవనం పైనుంచి జారిపడి వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడిని తరలిస్తున్న వైద్య సిబ్బంది

**కరకగూడెం:** భవనం పైనుంచి జారి పడిన వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రేగళ్ల గ్రామానికి చెందిన వలస ఆదివాసీ మడకం రాంబాబు గురువారం రాత్రి అంగన్వాడీ భవనంపై నిద్రించాడు. తెల్లవారుజామున నిద్ర మత్తులో భవనం పైనుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఎడమకాలు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## క్లుప్తంగా...

### వాతావరణ మార్పులపై మీడియా అకాడమీ శిక్షణ

- రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



అవార్డు అందుకుంటున్న సాక్షి విశాఖపట్నం ప్రతినిధి బి.కోటేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: వాతావరణ మార్పులపై విస్తృత కథనాలను ప్రజల్లోకి తీసుకెళ్లే జర్నలిస్టులకు మెరుగైన అవగాహన కల్పించే దిశగా రాష్ట్ర మీడియా అకాడమీ త్వరలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ సహకారంతో వ్యూస్ స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంయుక్తంగా నిర్వహించిన రెండ్రోజుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ ప్రజా వ్యవహారాల అధికారి అలెగ్జాండర్ మెక్‌లార్సన్ మాట్లాడుతూ వాతావరణ మార్పులపై అప్రమత్తం చేసేందుకు మీడియా ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా వాతావరణ మార్పులపై కథనాలు రాసిన సాక్షి దినపత్రిక విశాఖపట్నం ప్రతినిధి బి.కోటేశ్వరరావు బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు అందజేశారు.

### టీఎస్‌ఈడబ్ల్యూఐడీఎస్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ ఈడబ్ల్యూఐడీఎస్) కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. కార్పొరేషన్ చైర్మన్ చాంబర్ పూర్తిగా తగలబడిపోయింది. చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలోని పలు ఫైళ్లు కూడా అగ్నికి ఆహుతైనట్టు సమాచారం. నాంపల్లిలోని ఎల్బీ స్టేడియం పక్కన ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయం వెనుకభాగంలో ఈ భవనం ఉండడంతో ప్రమాదాన్ని ఎవరూ గుర్తించలేదు. శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు ఈ ఘటనను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీఎస్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(వీసీఎండీ)గా డాక్టర్ మల్లయ్యభట్టు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు చార్జ్ తీసుకొని వెళ్లిపోయారు. నిన్నటి దాకా ఇన్‌చార్జులతో కొనసాగిన ఈ విభాగానికి పూర్తిస్థాయి అధికారి వచ్చాక ప్రమాదం చోటుచేసుకోవడంపై అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయి.

# ప్రణీత్‌రావు ఇన్‌ఫార్మర్లలో మీడియా పెద్దలు!

**అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల కదలికలపై ప్రణీత్ దృష్టి**

- రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకుల సమాచారం సేకరించిన చానల్ పెద్ద
- వాట్సాప్ చాటింగ్ స్క్రీన్ షాట్లు సోషల్ మీడియాలో వైరల్

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో (ఎస్ఐబీ) డీఎస్పీగా పని చేస్తూ, నమ్మక ద్రోహానికి పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దుగ్యాల ప్రణీత్‌రావు కేసు దర్యాప్తులో అనేక కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల నగదు లావాదేవీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ఇతను కొందరు మీడియా పెద్దలను సైతం ఇన్‌ఫార్మర్లుగా వాడుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వాట్సాప్ చాటింగ్‌గా భావిస్తున్న స్క్రీన్ షాట్లు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అప్పటివరకు ఎస్ఐబీ ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు కింద పని చేసిన ప్రణీత్ రావు గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో పదోన్నతి పొందాడు. కొందరు కీలక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆదేశాల మేరకు తన ప్రైవేట్ సైన్యంతో కలిసి వార్ రూమ్ కేంద్రంగా కథ నడిపాడు. ప్రతిపక్ష నేతలు, వారి మద్దతుదారులకు సంబంధించిన కదలికలు, ఆర్థిక లావాదేవీలపై ప్రధానంగా దృష్టి పెట్టి పని చేశాడు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ నేతల ద్వారా కొన్ని ప్రత్యేక విభాగాలకు అందించాడు. ఈ క్రమంలో



ప్రణీత్‌రావు కొందరు మీడియా పెద్దల సహకారం కూడా తీసుకున్నట్లు తెలిసింది. ఓ చానల్‌కు నేతృత్వం వహిస్తున్న వ్యక్తి అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు, వీరికి అండగా నిలుస్తున్న వారి వివరాలను తన నెట్‌వర్క్ ద్వారా సేకరించాడు. ఈ వివరాలన్నీ ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా ప్రణీత్‌రావుకు పంపాడని వైరల్‌గా మారిన స్క్రీన్ షాట్లు స్పష్టం చేస్తున్నాయి.

#### వార్ రూమ్ నుంచి పర్యవేక్షణ

ప్రతిపక్ష నేతలు ఎక్కడకు వెళ్తున్నారు? వారిని ఎవరు కలుస్తున్నారు? తదితర అంశాలను ఎస్ఐబీలోని తన వార్ రూమ్ నుంచి ప్రణీత్ రావు పర్యవేక్షించారు. ఇతడి నేతృత్వంలోని బృందం ప్రతిపక్ష నేతల పైనే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులనూ టార్గెట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరుపుతారని, సంబంధాలు ఉన్నాయని భావించిన నాయకులపై నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. వీరి సంఖ్య 100 వరకు ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రణీత్‌రావును కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని కీలకాంశాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

#### మూడు ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం


ప్రణీత్‌రావు నుంచి మూడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు పంజగుట్ట పోలీసులు తమ రిమాండ్ రిపోర్టు ద్వారా కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. నిందితుడు ప్రధానంగా సాక్ష్యాధారాలు మాయం, ప్రజా ఆస్తుల ధ్వంసం, సాంకేతిక ఆధారాల మార్పి డి లాంటి నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. ఎస్ఐబీకి చెందిన రహస్య సమాచారాన్ని ప్రణీత్‌రావు తన వ్యక్తిగత పెన్‌డ్రైవ్‌లు, డిస్క్‌ల్లోకి కాపీ చేసుకున్నారని ఆరోపించారు. మరికొందరితో కలిసి ఈ అక్రమాలకు పాల్పడ్డ ప్రణీత్‌రావు అవి వెలుగులోకి రాకుండా చూసేందుకు గత ఏడాది డిసెంబర్ 4న రాత్రి ఎస్ఐబీ కార్యాలయంలో విధ్వంసానికి పాల్పడ్డాడని తెలిపారు. జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఈ కేసు దర్యాప్తు జరుపుతోంది.

# ‘క్యారీ ఓవర్’పై ట్రిబ్యునలే తేల్చాలి

- అంగీకరించిన వాటా కన్నా ఎక్కువే వాడారు
- తెలంగాణకు స్పష్టం చేసిన కృష్ణాబోర్డు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని మొత్తం 82.788 టీఎంసీల నిల్వల్లో 45 టీఎంసీలు ఏపీ, 35 టీఎంసీలను తెలంగాణకు కేటాయిస్తూ త్రిసభ్య కమిటీ నిర్ణయించగా, కేటాయింపులకు మించి తెలంగాణ 4.748 టీఎంసీలను ఆదనంగా వాడుకుందని కృష్ణానది యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. 2023 అక్టోబరు 1 నుంచి 2024 మార్చి 10 వరకు శ్రీశైలం జలాశయం నుంచి 26.571 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15.383 టీఎంసీలు మొత్తం 41.954 టీఎంసీలను ఏపీ వినియోగించుకోగా, శ్రీశైలం జలాశయం నుంచి 16.762 టీఎంసీలు, సాగర్ నుంచి 22.981 టీఎంసీలు కలిపి మొత్తం 39.743 టీఎంసీలను తెలంగాణ వినియోగించిందని పేర్కొంది. వచ్చే జూన్, జూలైలో తాగునీటి అవసరాల కోసం 2,788 టీఎంసీలు నిల్వ ఉంచామన్నారు. ఉమ్మడి జలాశయాల్లో సాగు, తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు లేవని గుర్తించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శికి కృష్ణా బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపూరే తాజాగా లేఖ రాశారు. సాగర్, శ్రీశైలం నుంచి నీటిని తరలించకుండా ఏపీని అడ్డుకోవాలని కోరుతూ తెలంగాణ రాసిన లేఖకు జవాబుగా ఈ లేఖ పంపించారు. తాగునీటి అవసరాలకు కేటాయించే నీటిలో 20 శాతాన్ని మాత్రమే లెక్కించాలనే తెలంగాణ వాదనపై బోర్డు సమావేశంలో ఏకాభిప్రాయం కుదరనందువల్లే నిర్ణయం తీసుకోలేకపోయామని ఆ లేఖలో పేర్కొంది. ఒక నీటి సంవత్సరంలో వాడుకోని వాటాజలాలను తదుపరి సంవత్సరంలోకి మళ్లించాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తిపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్–2)కు కేంద్రం అప్పగించిందని గుర్తు చేసింది. పాలేరు, కోటిపల్లి వాగు, చెట్టివాగు, పాకాల తదితర ప్రాజెక్టుల నీటి వినియోగపు లెక్కలను బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

## టమా‘రా’..!



టమాటా ధరలు భారీగా పడిపోయాయి. ఈ యాసంగి సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 522 ఎకరాల్లో టమాటా పంట సాగైంది. అన్ని కలిసి ఎకరాకు సుమారు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ధరలు ఒక్కసారిగా పడిపోవటంతో 25 కేజీల బాక్సు ధర రూ.80లోపే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తెంపిన టమాటాలను రైతులు రోడ్డు పక్కన పారబోస్తున్నారు. – ఝరాసంగం(జహీరాబాద్)

# మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేయడం మోదీ వల్ల కాదు

**ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్‌రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: ‘ బీజేపీ అధికారంలోకి వస్తే మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఇటీవల కేంద్ర హోంమంత్రి అన్నారు. మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేసే సత్తా అమిత్ షాకు లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కూడా సాధ్యం కాదు’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా శుక్రవారం మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ‘మైనారిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగుశాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నది. వైఎస్ హయాంలో కాంగ్రెస్ ఎంతో మంది న్యాయ నిపుణులతో చర్చించి రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మైనారిటీలకు అన్ని రంగాల్లో అవకాశాలను మెరుగుపర్చాం. అదనపు అడ్వొకేట్ జనరల్, మైనారిటీ సలహాదారు, ముఖ్యమంత్రి కార్యాలయం, వక్ఫ్‌బోర్డు చైర్మన్, టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా మైనారిటీలను నియమించాం. మైనారిటీల సంక్షేమానికి మా ప్రభుత్వం వినూత్న



కార్యక్రమాలు చేపడుతోంది. ఒక యూనివర్సిటీకి వీసీగా మైనారిటీలకు అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నా. హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. పాతబస్తీని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిజానికి అది ఓల్డ్ సిటీ కాదు..ఒరిజినల్ సిటీ..అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం. మైనారిటీ గురుకులాలకు అత్యాధునిక హంగులతో శాశ్వత భవనాలను నిర్మిస్తాం. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఎల్బీస్టేడియం వేదికగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది ఎల్బీ స్టేడియం నుంచే. అదే స్ఫూర్తితో ఇక్కడి నుంచే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాం’ అని సీఎం వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరి గుట్ట పులిహోర ప్రసాదంలో ఎలుక!

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో తయారు చేసే పులిహోర ప్రసాదంలో ఎలుక వచ్చినట్లు సోషల్ మీడియాలో శుక్రవారం చక్కర్లు కొట్టింది. ఓ కుటుంబానికి చెందిన భక్తులు శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారిని దర్శించుకొని, అక్కడే ఉన్న ప్రసాద విక్రయ శాలలో లడ్డూ, పులిహోర ప్రసాదం కొనుగోలు చేశారు. ఆ ప్రసాదాన్ని మొదటి ఘాట్ రోడ్డులో కూర్చుని తింటున్న క్రమంలో.. చనిపోయిన ఎలుక పులిహోరలో ప్రత్యక్షమైంది. దీంతో కంగుతిన్న భక్తు లు, వెంటనే ఆలయాధికారుల వద్దకు తీసు కెళ్లారు. భక్తులను ఆలయ అధికారులు సము దాయించి, వేరే పులిహోర ప్రసాదం అందజేసి, అక్కడి నుంచి పంపించారు. ఈ విషయాన్ని ప్రసాదం సెక్షన్ అధికారి అశోక్ కుమార్‌ను వివరణ కోరగా.. పులిహోర ప్రసాదంలో ఎలు క వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విష యాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



## ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్–2024 డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ నాయుడు, రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, ఉపాధ్యక్షురాలు సి.వనజ, కోశాధికారి రాజేశ్, సంయుక్త కార్యదర్శులు హరిప్రసాద్, రమేశ్ వైట్ల, ఈసీ సభ్యులు తదితరులు – సాక్షి, హైదరాబాద్

జిల్లా వార్తలు

## మార్కెట్‌లో నకిలీ బీడీలు!

- ఓ కంపెనీ బాధ్యుల తనిఖీల్లో గుర్తింపు

ఖమ్మంగాంధీచౌక్: మార్కెట్‌లో అక్రమార్కులు అసలు వస్తువులను పోలిన నకిలీవి రూపొందించి చెలామణి చేస్తున్నారు. ఇదేక్రమంలో ఖమ్మం శుక్రవారం నకిలీ బీడీల వ్యవహారం వెలుగుచూసింది. తమిళనాడు రాష్ట్రం గుడియాట్టమ్ సంత్‌పేట్ కేంద్రంగా ‘ఎస్’ బీడీ ఫ్యాక్టరీ నిర్వహిస్తుండగా, సదరు కంపెనీ ప్రతినిధులు సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ చెల్లిస్తుండగా, 24 కట్టలు ఉన్న ఒక్కో బండిల్‌ను రూ.525కు అమ్ముతున్నారు. అచ్చం ఇదే బ్రాండ్‌ను పోలిన ప్యాక్‌తో రూపొందించిన నకిలీ బీడీల బండిల్‌ను రూ.200 నుంచి రూ.300వరకు అక్రమార్కులు మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. కొంతకాలంగా ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తుండగా, ‘ఎస్’ కంపెనీ బీడీల విక్రయాలు 40 శాతం మేర తగ్గిపోవడంతో యాజమాన్యానికి అనుమానం వచ్చింది. దీంతో కంపెనీ ప్రతినిధులు గౌస్ లతీఫ్, మహ్మద్ పాషా, ఇజాహిద్ ఖమ్మంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేయగా నకిలీ వ్యవహారం బయటపడింది. ఈమేరకు సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

## దళారుల మాటలు నమ్మకండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ పరిధిలో గడిచిన వారం రోజుల్లోనే 600ఎక్స్‌టర్నల్ పోస్టులతోపాటు 986 ఇంటర్నల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశామని తెలిపారు. ఇంటర్నల్ పోస్టులకు ఈనెల 20నుండి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనుండగా, ఎక్స్‌టర్నల్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని చెప్పారు. ఈ పోస్టులన్నీ రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగానే భర్తీ చేస్తామని, దళారుల మాటలు నమ్మి మోసపోకుండా అలాంటి వారి వివరాలను ఏసీబీ లేదా సింగరేణి విజిలెన్స్ శాఖకు తెలియచేయాలని సూచించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాల కోసం https://scclmines.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. కాగా, వివిధ విభాగాల్లో 200 ఖాళీ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నామని జీఎం బసవయ్య తెలిపారు.

## బాలుడిపై ఇంటర్ విద్యార్థుల దాడి

ఖమ్మంక్రైం: ఇంటర్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న బాలుడిపై దాడికి దిగారు. పదో తరగతి చదువుతున్న బాలుడు శుక్రవారం సాయంత్రం స్కూల్ నుంచి ట్యూషన్‌కు వెళ్తుండగా ఇంటర్ విద్యార్థులు అడ్డగించి దాడి చేశారు. అదే సమయాన అక్కడ ఉన్న ప్రిన్సిపాల్ వారిలో ఒకరిని పట్టుకోగా మిగతా వారు పారిపోయారు. ఘటనపై బాలుడి తల్లి శుక్రవారం రాత్రి ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. అయితే, దాడి చేసిన విద్యార్థులు మత్తులో తూగుతున్నట్లు కనిపించిందని స్థానికులు తెలిపారు.

# విద్యుత్ ఉత్పత్తికి గండి..

- కేటీపీఎస్ 5వ దశ పదో యూనిట్‌లో ఓవరాయిలింగ్‌పై నిర్లక్ష్యం
- రెండేళ్లుగా నిర్వహణను మరిచిన యంత్రాంగం
- ఫలితంగా 250 మెగావాట్లలో 50 మెగావాట్లు తగ్గుతున్న ఉత్పత్తి
- రోజుకు రూ.40లక్షల మేర నష్టం



కేటీపీఎస్ 5వ దశ కర్మాగారం

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచడంలో కీలక భూమిక పోషిస్తున్న భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్(కేటీపీఎస్)లో విద్యుత్ ఉత్పత్తికి భారీగా గండి పడుతోంది. రోజురోజుకూ ఎండలు ముదురుతున్న తరుణాన రాష్ట్రంలో విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలో అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉండగా ప్రణాళికా లోపం కారణంగా థర్మల్ పవర్ స్టేషన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోలేకపోతుండటం గమనార్హం.

#### 5వ దశలో తగ్గిన 50 మెగావాట్లు

కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలో 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 10వ యూనిట్ కొంతకాలంగా 200 మెగావాట్ల ఉత్పత్తిని దాటడం లేదు. ఈ యూనిట్‌లో ఏడాదికోసారి నిర్వహించాల్సిన ఓవరాయిలింగ్(నిర్వహణ) పనులు గత మూడేళ్లుగా చేపట్టడం లేదని అక్కడి ఉద్యోగులు వాపోతున్నారు. గతంలో ఏటా నిర్వహించే ఓవరాల్ పనులను రెండేళ్లకోమారు చేస్తున్నారు. అయినా ఇక్కడ అది కూడా చేయక మూడేళ్లు కావస్తోంది. ఫలితంగా రోజుకు 50 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి గండి పడుతోంది. చివరిసారిగా 2020 జూలైలో ఓవరాల్ మరమ్మతు పనులు నిర్వహించారు. మళ్లీ సంవత్సరానికి చేయాల్సి ఉండగా రెండేళ్లకు టార్గెట్ విధించుకుని.. ఆ సమయం కూడా మించినా పట్టించుకోకపోవడం గమనార్హం.

#### ఏప్రిల్‌లో చేస్తాం..

కేటీపీఎస్ ఐదో దశ 10వ యూనిట్ నిర్వహణపై కేటీపీఎస్ 5, 6వ దశల చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావును వివరణ కోరగా.. ఓవరాల్ పనులు ఆలస్యమైన మాట వాస్తవమేనని తెలిపారు. బీహెచ్‌ఈఎల్ కంపెనీ గత నవంబర్‌లో ఓవరాల్ పనులు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందుకు కావాల్సిన రా మెటీరియల్ కూడా ఆర్డర్ ఇచ్చినా అవి రాలేదని తెలిపారు. ఏదేమైనా ఏప్రిల్‌లో ఓవరాయిలింగ్ పనులు చేపడుతామని ఆయన వెల్లడించారు.


#### రోజు వారీ నష్టం రూ.40లక్షలు..

ఓవరాయిలింగ్ పనులు జరగని కారణంగా 10వ యూనిట్‌లో తరచూ అవాంతరాలు తలెత్తుతున్నాయి. ఉత్పత్తి నిలిచి పోతుండటంతో తాత్కాలిక మరమ్మతులు చేసి మళ్లీ యూనిట్‌ను పునరుద్ధరించి రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా 250 మెగావాట్లకు గాను 200 మెగావాట్ల లోపు మాత్రమే ఉత్పత్తి నమోదవుతోంది. ఒక్కోసారి 180 మెగావాట్లకు కూడా పడిపోతోంది. సరాసరి రోజుకు 50 మెగావాట్లు అందకపోవడంతో రోజుకు సుమారు రూ.40లక్షల వరకు జెన్‌కోకు నష్టం వాటిల్లుతున్నట్లు తెలిసింది. అంతేగాక తరచూ మరమ్మతులకు భారీగా ఖర్చు చేస్తున్నారు. అయినా ఓవరాయిలింగ్‌పై దృష్టి సారించకపోవడం గమనార్హం.

# వాడీవేడిగా డీసీసీబీ మహాజన సభ

- రుణాలపై ఆంక్షల విషయంలో చైర్మన్ల ఆవేదన
- సీఈఓ రైతు పక్షపాతిగా వ్యవహరించాలని సూచన

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) 124వ మహాజన సభ వాడీవేడిగా సాగింది. సహకార సంఘాల విషయంలో బ్యాంకు తీరు సక్రమంగా లేదని పలువురు చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. ఈ సభలో డీసీసీబీ పరిధిలోని పీఏసీఎస్‌ల చైర్మన్లు పాల్గొనగా, వార్షిక నివేదిక ఆమోదించడంతో పాటు మరో పది అంశాలపై చర్చించారు. అనంతరం పలువురు పీఏసీఎస్‌ల చైర్మన్లు మాట్లాడుతూ





సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు

రైతులు వాహనాలతో పాటు యంత్రాల కోసం రుణానికి దరఖాస్తు చేసుకుంటే అనేక ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. పాస్‌బుక్‌లు, 14 ఏళ్ల పహణీలు సమర్పించాలనే నిబంధనలతో ఏజెన్సీ ప్రాంత రైతులు ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. అంతేకాక అప్పు ఉన్న కొందరి రైతుల భూముల్లో జెండాలు పాతి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో పంట రుణాలను రెన్యూవల్ చేయకపోవడంతో సమాధానం చెప్పలేకపోతున్నామని తెలిపారు. డీసీసీబీ సీఈఓ రైతు పక్షపాతిగా కాకుండా కార్పొరేట్ బ్యాంకు తరహాలో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సహకార సంఘాల నుంచి సాఫ్ట్‌వేర్ చార్జీల పేరిట రూ.2 లక్షలు వసూలు చేయడం సరికాదన్నారు. ఖమ్మంకు చెందిన మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డీసీసీబీ నుంచి మత్స్యకారులకు ఎలాంటి సహకారం లేదని తెలిపారు. కాగా, ఖాళీగా ఉన్న డైరెక్టర్ల ఎన్నిక నిర్వహిస్తారని భావించినా జరగలేదు. ఈ సందర్భంగా బ్యాంకు బైలా సవరణలను ఆమోదించడంతో పాటు పలు అంశాలపై తీర్మానాలు చేశారు. బ్యాంకు సీఈఓ అబిద్ ఉర్ రెహమాన్, డైరెక్టర్లు తుల్లూరి బ్రహ్మయ్య, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, లక్కినేని సురేందర్‌రావు, మేకల మల్లిబాబు యాదవ్, జనగం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలి

- నేటి నుంచి ఈయూ రాష్ట్ర మూడో మహాసభలు
- వివరాలు వెల్లడించిన ఎంప్లాయీస్ యూనియన్ నేతలు




మాట్లాడుతున్న బాబు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ కార్మికులపై విపరీతమైన పనిభారం పడటమే కాక విధి నిర్వహణ కత్తి మీద సాములా మారిన నేపథ్యాన రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పనిభారం తగ్గించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు కోరారు. కార్మికులపై యాజమాన్యం వేధింపులు కూడా పెరిగాయని ఆరోపించారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబు మాట్లాడారు. ఆర్టీసీలో గత ప్రభుత్వం రద్దు చేసిన ట్రేడ్ యూనియన్లను కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ పూర్తిచేయాలని, ఫిట్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వడంతో పాటు డీఏల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సహిత చట్టంతో డ్రైవర్లు పనిచేయలేని పరిస్థితి ఉన్నందున తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. కాగా, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణికులు పెరిగినందున సిబ్బంది, బస్సుల సంఖ్య పెంచాలని ఆయన కోరారు.

#### ఖమ్మంలో రాష్ట్ర మహాసభలు

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మూడో రాష్ట్ర మహాసభలను ఖమ్మంలో ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు బాబు తెలిపారు. ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఈ సభలను డిప్యూటీ భట్టి విక్రమార్క, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించనుండగా, రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.వెంకన్న, నాయకులు తిమ్మినేని రామారావు, పాటి అప్పారావు, పిల్లి రమేశ్, తోట రామాంజనేయులు, బుచ్చిబాబు, బీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుటీర పరిశ్రమలతో అదనపు ఆదాయం



తేనెటీగల పెంపకాన్ని పరిశీలిస్తున్న మహిళా రైతులు

అశ్వారావుపేటరూరల్: కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మహిళలు అదనపు ఆదాయాన్ని పొందొచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ కళాశాలను శుక్రవారం ములకలపల్లికి చెందిన గుడ్ షెఫర్డ్ ఎన్‌జీఓ ద్వారా మహిళా రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అదనపు ఆదాయ మార్గాలపై ప్రొఫెసర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీన్ మాట్లాడుతూ.. మహిళలు వ్యవసాయ అనుబంధ రంగాలైన పుట్టగొడుగుల పెంపకం, సేంద్రియ ఎరువు తయారీ, తేనెటీగల పెంపకంతో ఆర్థికాభివద్ధి సాధించొచ్చని తెలిపారు. ప్రొఫెసర్లు డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ దీపక్‌రెడ్డి, డాక్టర్ శిరీష, డాక్టర్ టి.పావని, డాక్టర్ పి.శ్రీలత, డాక్టర్ పి.రెడ్డిప్రియ పాల్గొన్నారు.

## విరాళాలకు ఇక కంప్యూటరైజ్డ్ రశీదులు

**చాలీసా భక్తులకు ఉచిత ప్రత్యేక దర్శనం**



భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి విరాళాలు అందజేసే భక్తులకు శుక్రవారం నుంచి కంప్యూటరైజ్డ్ రశీదులు ఇస్తున్నా రు. ఈ మేరకు ఆలయ ఈఓ రమాదేవి ఉత్తర్వులు విడుదల చేశారు. శాశ్వత నిత్యకల్యాణాలు, శాశ్వత పూజలు, నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళాలు ఇచ్చే భక్తులకు ఇప్పటివరకు చేతితో రాసిన రశీదును ఇచ్చేవారు. అయితే ఆలయంలో పారదర్శకత కోసం ఇటీవల రూపొందించిన ప్రణాళికల్లో భాగంగా విరాళాల వివరాలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేసి బాండ్‌లు అందజేయాలని నిర్ణయించారు. ఇక ఆలయంలో హనుమాన్ చాలీసా, విష్ణుసహస్రనామ పారాయణం, లలితా సహస్ర నామ పారాయణం చేసే మహిళలకు రూ.100 క్యూలైన్ ద్వారా ఉచితంగా స్వామివారి దర్శనం కల్పిస్తామని ఈఓ పేర్కొన్నారు.